సాక్షి అనంతపురం

బుధవారం । 10 । జనవరి । 2024



నేడు డయల్ యువర్ డీఎం

ఆర్టీసీ ప్రయాణికుల కోసం బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నారు.



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
30.4°/19.5°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పెన్నహోబిలం ఆలయ హుండీ కానుకల లెక్కింపు



లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ, పర్యవేక్షణ అధికారి

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆరు శాశ్వత హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ అధికారుల సమక్షంలో లెక్కించారు. పర్యవేక్షణ అధికారి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాణి, ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన హుండి లెక్కింపులో 106 రోజులకు సంబంధించి రూ.22.71 లక్షల ఆదాయం వచ్చింది. 2.205 మి.గ్రా బంగారం, 20.650 గ్రాముల వెండి వచ్చింది. కానుకల లెక్కింపులో శ్రీహనుమాన్ సేవా సమతి వారు పాల్గొన్నారు.

'విశ్వకర్మ' పథకానికి 60వేలకు పైగా దరఖాస్తులు

- పరిశ్రమల శాఖ జీఎం నాగరాజరావు



అనంతపురం టౌన్: చేతి వృత్తిదారులకు ఆర్థిక చేయూత అందించి తమ రంగంలో మరింతగా రాణించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా అర్హత కల్గిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. 60వేల మందికి పైగా చేతి వృత్తిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి అర్హత కల్గిన వారిని విశ్వకర్మ పథకానికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. చేతివృత్తిదారులు తమ రంగంపై మరింతగా ప్రావీణ్యం సాధించేందుకు స్కిల్ డెవలప్ మెంట్ పథకం కింద వారికి 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చి టూల్ కిట్ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం విశ్వకర్మ పథకంలో అర్హత ఉన్న లబ్ధిదారులకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అతి తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పించనున్నామన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ



సమ్మె విరమణ పత్రం ఏపీసీ వరప్రసాదరావుకు అందజేస్తున్న ఉద్యోగులు

అనంతపురం ఎడ్యుకేషన్: తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష తాత్కాలిక, కాంట్రాక్ట్ ఉద్యోగులు మంగళవారం సమ్మె విరమించారు. సమగ్ర శిక్ష జిల్లా అదనపు కోఆర్డినేటర్ జె.వరప్రసాదరావును కలిసి సమ్మె విరమణ పత్రం అందజేశారు. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అందరూ విధుల్లో కొనసాగుతామని వివరించారు. తాము చేసిన డిమాండ్లలో కొన్నింటిని ప్రభుత్వం పరిష్కరించిందని మరి కొన్ని డిమాండ్లను భవిష్యత్తులో పరిశీలించి, పరిష్కరిస్తారని సమ్మె విరమించాలని రాష్ట్ర అధికారులు సమగ్ర శిక్ష ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారని ఏపీసీ పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తి మేరకు జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ మళ్లీ విధుల్లోకి చేరారని సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు.

బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–20), నాల్గో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–20) పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ మంగళవారం విడుదల చేశారు. పరీక్షలు జరిగిన తొమ్మిది రోజుల వ్యవధిలోనే ఫలితాలు విడుదల చేయడం రికార్డుగా ఆయన అభివర్ణించారు. ఇందుకు కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.విష్ణువర్ధన్, డాక్టర్ డి.లలితకుమారిని ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, ప్రొఫెసర్ భాలనరసయ్య, డాక్టర్ కె.భారతి, డాక్టర్ రామశేఖరరెడ్డి, డాక్టర్ కళ్యాణిరాధ, డాక్టర్ శైలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్య ఝురి

అణచివేతకు లోనై, గుర్తింపునకు నోచుకోని బడుగులకు జగనన్న పాలనలో న్యాయం జరిగింది. స్థానిక సంస్థల నుంచి చట్ట సభల్లో ప్రాతినిధ్యం లభించింది. నామినేటెడ్ పదవుల్లోనూ సింహభాగం అవకాశం కలిగింది. సంక్షేమ పథకాల ద్వారానూ ఆర్థిక చేయూత దక్కింది. సామాజిక సమతుల్యత పరిఢవిల్లింది. ఆ ఫలాలను అందుకున్న బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీ వర్గాలు గుంతకల్లులో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు భారీ సంఖ్యలో తరలివచ్చి సింహనాదం చేశాయి. తమ గుండెల్లో కొలువైన జగన్‌కు జై కొట్టాయి.



గుంతకల్లులో మంగళవారం సామాజిక సాధికార యాత్ర సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఒక భాగం

- గుంతకల్లులో పోటెత్తిన జనం
- జగన్ నినాదాలతో మార్మోగిన సభా ప్రాంగణం
- సామాజిక సాధికార బస్సు యాత్రతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం



రాజన్న చిత్రపటంతో సందడి చేస్తున్న యువకుడు



సభలో మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్, చిత్రంలో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వీఆర్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా నరసింహయ్య తదితరులు

గుంతకల్లు: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జగన్ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర మంగళవారం గుంతకల్లులో జరిగింది. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బస్సు యాత్రలో ఎంపీలు నందిగం సురేష్, తలారి రంగయ్య, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు ఆలీ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ పార్లమెంటు సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, టీటీడీ బోర్డు మెంబర్ అశ్వత్థనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ పాల్గొన్నారు. బీరప్ప సర్కిల్ నుంచి మస్తానయ్య దర్గా, ఆర్టీసీ బస్టాండ్, పొట్టిశ్రీరాములు సర్కిల్, మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్సార్ విగ్రహం వద్ద వరకు బస్సు యాత్ర సాగింది. గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల నుంచి తరలివచ్చిన బడుగు, బలహీన వర్గాల ప్రజలు, అభిమానులు దారిపొడవునా వైఎస్సార్‌సీపీ జెండాలు చేతపట్టి ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. అనంతరం వైఎస్సార్ సర్కిల్‌లో సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వం చేసిన మేలును వివరించినపుడు సభా ప్రాంగణం ఈలలు, కేకలతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. బస్సు యాత్ర విజయవంతం కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం పెల్లుబికింది. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు రామలింగప్ప, జింకల రామాంజినేయులు, ఎంపీపీ మాధవి, గుత్తి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, పామిడి ఎంపీపీ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం



మధ్యవర్తులు లేరు, కమీషన్లు లేవు, లంచాలు లేవు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుంది. దాదాపు రూ.4 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ రూ.1,700 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. ప్రతి ఒక్కరూ ఈ విషయాలు గుర్తు చేసుకొని ఫ్యాన్‌కు ఓటు వేయాలి.

– తలారి రంగయ్య, ఎంపీ

ప్రజా సంక్షేమమే పరమావధి



ప్రజా సంక్షేమమే పరమావధిగా జగనన్న పాలన సాగిస్తున్నారు. గుంతకల్లు చరిత్రలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకు, పాలిటెక్నిక్ కళాశాల, ఆర్డీఓ కార్యాలయాల ఏర్పాటుతోపాటు కోట్ల రూపాయలు ఖర్చు చేసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద పీట వేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. అభివృద్ధి జరగాలన్నా వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

– వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి



గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుకే పరిమితం చేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసింది. సంక్షేమ పథకాలు, పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో సామాజికంగా, ఆర్థికంగా ఎదిగారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం.

– శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త

బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట



బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన ఘనత జగనన్నకే దక్కుతుంది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారు. సంక్షేమ పథకం అందని కుటుంబమంటూ ఏదీ లేదు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడ్డారు. మాయ మాటలతో ఓట్ల కోసం వస్తున్న చంద్రబాబును ఎవరూ నమ్మవద్దు.

– బోయ గిరిజమ్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్



సభా ప్రాంగణం వద్ద మహిళల ఆనంద నృత్యం



గిరగిరా తిరగాలి ఫ్యాను అంటూ ఆటతో కలిసి నినదిస్తున్న ప్రజాప్రతినిధులు, నేతలు



అభిమానుల జయజయ ధ్వానాల నడుమ సాగుతున్న సామాజిక సాధికార బస్సు యాత్ర

వెల్లివిరిసిన 'తెలుగు' వైభవం



మాట్లాడుతున్న అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, చిత్రంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని, ఆచార్య రాచపాలెం, శాంతినారాయణ



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న కళాకారులు

- ఘనంగా 'తెలుగు భాషా వైభవ' సదస్సు
- జిల్లా సాహితీ దిగ్గజాలకు సేవా పురస్కారాలు
- సాహిత్యంతో సమాజ రుగ్మతలను రూపుమాపాలని వక్తల పిలుపు

అనంతపురం/అనంతపురం కల్చరల్: జేఎన్‌టీయూ (ఏ) ఆడిటోరియంలో మంగళవారం 'తెలుగు భాషా వైభవ సదస్సు' అంగరంగ వైభవంగా సాగింది. జిల్లా సాహిత్య చరిత్రలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పాల్గొన్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, సీఆర్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజయబాబు మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న రుగ్మతలను సాహిత్యమనే ఔషధంతో రూపుమాపాలన్నారు. సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషితోనే తెలుగు భాషా వైభవ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి జిల్లా సాహిత్య ఔన్నత్యాన్ని చాటేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లావాసుల సాహిత్య కృషి స్ఫూర్తిదాయకమన్నారు. అధికార భాషా సంఘం సభ్యుడు కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందిస్తోందన్నారు. సంకుచిత భావంతో ఎవరూ తప్పు పట్టరాదని హితవు పలికారు. కొత్తపల్లి సురేష్ వ్యాఖ్యానం ఆకట్టుకుంది. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ చింతా సుధాకర్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, టూరిజం శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, అధికార భాషా సంఘం సభ్యులు కత్తి వెంకటేశ్వర్లు, ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ, ఆర్‌ఐఓ సురేష్‌బాబు, డీఈఓ నాగరాజు, డీవీఈఓ వెంకటరమణనాయక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రసంగాలు..

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు ఆధ్వర్యంలో ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా వివిధ అంశాలను స్పృశిస్తూ ప్రసంగాలు సాగాయి. జిల్లా సాహిత్య విశిష్టతపై డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, పద్యంపై డాక్టర్ అమళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్, ఆధునిక కవిత్వంపై డాక్టర్ అంకే శ్రీనివాస్, నవలపై డాక్టర్ కె.నాగేశ్వరాచారి, కథానికపై డాక్టర్ బావికాటి రాఘవేంద్ర, జానపదంపై డాక్టర్ శివణ్ణ, నాటకం–బళ్లారి రాఘవ అనే అంశంపై గుత్తా హరిసర్వోత్తమనాయుడు, సాహిత్య విమర్శపై డాక్టర్ ఏ.ఏ. నాగేంద్ర, సాహిత్యంలో హాస్యం అనే అంశంపై గుంటి మురళీకృష్ణ ప్రసంగించారు.

పురస్కారాల ప్రదానం..

'తెలుగు భాషా వైభవ సదస్సు'లో జిల్లాకు చెందిన పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఆచార్య మూడే గోనా నాయక్, కంబదూరు షేక్ నబీరసూల్, చొప్పా వీరభద్రప్ప, లక్ష్మీజయరాజ్, జెట్టీ జైరాం, డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, డాక్టర్ అమళ్లదిన్నె వెంకటరమణప్రసాద్, డాక్టర్ కేతు బుచ్చిరెడ్డి, డాక్టర్ కల్లూరు ఆనందరావు, శాంతి జయప్రకాష్‌కు జీవన సాఫల్య పురస్కారాలతో సత్కరించారు. మరో 40 మందికి సేవా ప్రతిభ అవార్డులు అందించారు.

అలరించిన 'జయహో శ్రీకృష్ణదేవరాయ'

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు రచించిన 'జయహో శ్రీకృష్ణదేవరాయ' కళారూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. శ్రీకృష్ణదేవరాయలుగా సినీనటుడు కౌశిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కళాకారులు, కవులను అధికారులు సత్కరించారు.

మెరుగైన వైద్య సేవలందించండి



ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

గుంతకల్లు రూరల్: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహిస్తోందని డీఎంహెచ్‌ఓ ఇ.భ్రమరాంబదేవి తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పాతకొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నవీన్‌కుమార్ బాబు, సాయి ప్రశాంత్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ వంశీ ఆధ్వర్యంలో 455 మందికి ఓపీ సేవలందించారు. గుండె, కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న ముగ్గురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. వైద్య శిబిరంలో అందుతున్న సేవలను జిల్లా ప్రోగ్రామ్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్‌తో కలిసి డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ద్వారా సంక్రమిత వ్యాధులను నివారించవచ్చని, క్రమం తప్పకుండా నడక, వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి చేయడం ద్వారా బీపీ, షుగర్, బ్రెయిన్ స్ట్రోక్, గుండెజబ్బు, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులబారిన పడకుండా తమను తాము కాపాడుకోవచ్చనే విషయాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని వైద్యులకు సూచించారు.

ఆరోగ్య సురక్షకు స్పందన

అనంతపురం మెడికల్: జిల్లాలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభించింది. అనంతపురం రూరల్ 2, తలుపూరు, సంతెకొండాపురం, రెడ్డిపల్లి 2, డీ హీరేహాళ్ 1, పాత కొత్తచెరువు, బ్యాడ్రహళ్లి, కళేకుర్తి, ఇప్పేరు, బండ్లపల్లి, మల్లాపురం, ములకలేడు, చుక్కలూరు 2, ఆమిద్యాల 1, యాడికి 1 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 5,854 మంది ఓపీ సేవలు పొందారు. స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు రోగులను పరీక్షించి, సమస్యలున్న నలుగురిని ప్రభుత్వ సర్వజనాస్పత్రి, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

నేడు 8 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లాలో 8 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి తెలిపారు.

క్లుప్తంగా

సహకారంతోనే సమగ్రాభివృద్ధి



మాట్లాడుతున్న రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాస్

అనంతపురం అగ్రికల్చర్: ఏ రంగంలోనైనా పరస్పర సహకారంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని గొర్రెలు, మేకల సహకార సంఘాల ఫెడరేషన్ ఏపీ, తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక పశుశాఖ కార్యాలయంలో గొర్రెలు, మేకల సహకార సంఘాల సభ్యులకు 'సహకారం ద్వారా సమృద్ధి' అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. షీప్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్‌తో పాటు షీప్ యూనియన్ త్రీమెన్ కమిటీ జిల్లా చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, పశువైద్యులు డాక్టర్ గోల్డ్‌స్మన్ తదితరులు హాజరయ్యారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీ యూనిట్లు, సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

22న అయోధ్యకు రండి

- సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌కు రామ జన్మభూమి ట్రస్ట్ ఆహ్వానం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: దేశంలోనే ప్రఖ్యాత ధార్మిక సంస్థగా పేరుగాంచిన సత్యసాయి ట్రస్ట్‌కు రామ జన్మభూమి తీర్థ క్షేత్ర నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈమేరకు సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌కు రామ జన్మభూమి తీర్థ క్షేత్ర సెక్రటరీ జనరల్ చంపత్‌రాయ్ ప్రత్యేక ఆహ్వానం పంపారు. ఈనెల 22న అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రం నుంచి సుమారు 30 మంది ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ క్రమంలోనే రత్నాకర్‌కు ఆహ్వానం పలికారు. ఈనెల 21న అయోధ్యకు బయలుదేరనున్నట్టు రత్నాకర్ తెలిపారు. తనకు ప్రత్యేక ఆహ్వానం పంపడం ఆనందంగా ఉందన్నారు.

ఎన్నికల విధులకు ఆర్టీఏ అధికారుల నియామకం

అనంతపురం సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులకు అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎంవీఐ)ను నియమించినట్లు ఉప రవాణా కమిషనర్ వీర్రాజు తెలిపారు. ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆదేశాల మేరకు వారిని బదిలీ చేశామన్నారు. ఏఎంవీఐ రఘునాథ్‌ను ఓబుళాపురం, కేవీఎల్ఎన్ ప్రసాద్‌ను విడపనకల్లు, శ్రీనివాసరావును దొర్నకల్ చెక్‌పోస్టుకు నియమించినట్లు వివరించారు. పోలీసు, సెబ్, ఫారెస్ట్, తదితర ప్రభుత్వశాఖల సమన్వయంతో ఈ చెక్‌పోస్టులు పనిచేస్తాయన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ చెక్‌పోస్టు విధుల్లో పాల్గొంటారని వివరించారు.

బాబుకు రాజకీయ సమాధి ఖాయం

- బాపట్ల ఎంపీ నందిగం సురేష్



మాట్లాడుతున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్, చిత్రంలో ఎమ్మెల్యేలు వై.వెంకటరామిరెడ్డి, శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, తదితరులు

గుంతకల్లుటౌన్: 'బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడానికి రాష్ట్రంలోని దుష్టశక్తులన్నీ ఏకమవుతున్నాయి. చంద్రబాబు దొడ్డిదారిన సీఎం అయ్యేందుకు రక్తసంబంధాలను కూడా చీల్చేస్తున్నాడు. టీడీపీ, జనసేన, కాంగ్రెస్ ఇంకా ఎన్ని పార్టీలు కలిసొచ్చినా మళ్లీ వైఎస్సార్‌సీపీదే గెలుపు' అని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గుంతకల్లులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన గాయత్రీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం జగనన్న నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తే, చంద్రబాబు మాత్రం 14 ఏళ్ల వెన్నుపోటు పథకాలను అమలు చేశాడన్నారు. అమరావతి రాజధాని పేరిట బడుగు, బలహీనవర్గాలకు చెందిన భూములను బలవంతంగా సేకరించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం ద్వారా రూ.వందల కోట్లు దోచేశాడని విమర్శించారు. పవన్‌కళ్యాణ్‌కు కూడా కొన్ని ప్లాట్లు కేటాయించి ఆ పాపంలో అతడిని కూడా భాగస్వామ్యం చేశాడన్నారు. ఒకప్పుడు చంద్రబాబుకు కేవలం రెండు ఎకరాలు మాత్రమే ఉందని, ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో అడ్డదిడ్డంగా ప్రజాధనాన్ని లూటీ చేసి ఏకంగా రూ.6 లక్షల కోట్లను వెనుకేసుకున్నాడని విమర్శించారు. మళ్లీ అధికారమిస్తే రూ.12 లక్షల కోట్లు సంపాదించడం ఖాయమన్నారు. కరోనా లాంటి విపత్కర సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ ప్రాణాలు కాపాడుకునేందుకు హైదరాబాద్‌లో తలదాచుకుని జూమ్ మీటింగ్‌లు పెట్టుకుంటే, జగనన్న మాత్రం ఓ సైనికుడిగా రాష్ట్ర ప్రజలకు రక్షణగా నిలిచారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలిస్తే ఇక్కడ టీడీపీ అధికారంలోకి వచ్చినట్టు పచ్చపార్టీ నేతలు ఫీలవ్వడం చూస్తే ఎవరికో పుట్టిన బిడ్డను మరెవరో ముద్దాడినట్టుందని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు రాజకీయంగా సమాధి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఇక ఆయనకు మిగిలేది శేషజీవితమేనని చెప్పారు. మరో 25 ఏళ్ల జగనన్నే ముఖ్యమంత్రిగా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు.

కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్ చంద్రబాబు

కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్‌గా నిలిచిన చంద్రబాబు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప ఆయా వర్గాల ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి, అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త, ఎమ్మెల్యే ఎం.శంకరనారాయణ అన్నారు. చంద్రబాబుది బూర్జువా మనస్తత్వమని నిప్పులు చెరిగారు. దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసి అభినవ పూలేగా, అభినవ అంబేడ్కర్‌గా ప్రజల చేత సీఎం జగన్ కొనియాడబడుతున్నారన్నారు. చంద్రబాబుకు దమ్ము ధైర్యం ఉంటే టీడీపీ, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోల్లోని హామీల అమలుపై ప్రజల్లో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. టీడీపీ జిమ్మిక్కులు నమ్మకుండా జగనన్న చేసిన మంచిని గమనించి మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.

జగనన్నతోనే సాధికారత సాధ్యం

దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను అన్ని రంగాల్లో అగ్రస్థానాన్ని కల్పించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి వెల్లడించారు. బడుగు, బలహీన వర్గాలను చంద్రబాబు ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటే జగనన్న మాత్రం ఆయావర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. ప్రజలందరి చల్లని దీవెనలతో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావడం తథ్యమని వైవీఆర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ, వైస్ చైర్‌పర్సన్ మైమూన్, ఎంపీపీ మాధవి పాల్గొన్నారు.

అఫర్వాట్ శిఖరంపై 'వన్స్‌మోర్ జగనన్న జెండా'



వన్స్‌మోర్ జగనన్న జెండాతో షేక్ షాషు

బత్తలపల్లి: జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ నుంచి 56 కిలోమీటర్లు దూరంలో ఉన్న అఫర్వాట్ శిఖరంపైన వన్స్‌మోర్ జగనన్న జెండా రెపరెపలాడింది. సముద్ర మట్టానికి 13,999 అడుగుల ఎత్తులోని ఈ పర్వతాన్ని మంగళవారం బత్తలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకుడు షేక్ షాషు అధిరోహించి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ నవరత్నాలతో రాష్ట్రంలోని పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ పర్వతాన్ని అధిరోహించినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలకు అండగా నిలుస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందాలని, వారిపైన ఉన్న అభిమానంతో 13,999 అడుగుల ఎత్తులోని పర్వతంపైకి చేరుకుని జెండాను ఎగురవేసినట్లు వివరించారు.

నూతన కంట్రోల్ కార్యాలయ సేవలు ప్రారంభం

గుంతకల్లు: డివిజన్ కేంద్రమైన గుంతకల్లులో దాదాపు రూ.38 కోట్లతో నూతనంగా నిర్మించిన కంట్రోల్ కార్యాలయం నుంచి సేవలు ప్రారంభించినట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు తెలిపారు. కంట్రోల్ కార్యాలయం ఉద్యోగులు 24/7 రైలు ప్రయాణికులకు సేవలు అందిస్తుంటారు. రైళ్ల రాకపోకలు, ప్రయాణికులకు ఏవైనా సమస్యలు ఏర్పడినప్పుడు వారికి సహాయ పడేందుకు సంబంధిత విభాగాల సిబ్బందిని అప్రమత్తం చేయడం, రైళ్లల్లో చోరీలు జరిగినప్పుడు పోలీసులకు సమాచారం చేరవేయడంలో కంట్రోల్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తుంటారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా...

- నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం నుంచి మండలస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,33,670 మంది క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు టోర్నీలు

డిసెంబర్ 26న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామస్థాయిలో ఇప్పటికే పోటీలు పూర్తయ్యాయి. నేటి నుంచి 23వ తేదీ వరకూ మండలస్థాయి, 24 నుంచి 30 వరకు నియోజకవర్గస్థాయి, 31 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకూ జిల్లాస్థాయి, ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 663 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడలు నిర్వహిస్తున్నారు.

నగదు బహుమతులు

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ పోటీ విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు అందించనున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ తృతీయ విజేతలకు వరుసగా రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షలు ఇవ్వనున్నారు.

క్రీడాకారులకు టీషర్టులు

మండల స్థాయిలో పాల్గొనే క్రీడాకారులందరికీ టీ- షర్టులు, టోపీలు అందజేశారు. పోటీల ఏర్పాట్లపై ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో అన్ని వసతులు కల్పించారు. మండల స్థాయిలో పోటీల నిర్వహణకు ఒక్కో మండలానికి రూ.25 వేల చొప్పున నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. క్రీడా మైదానాల వద్ద తాగునీటి సదుపాయం, ప్రాథమిక వైద్యం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు రెండో దశకు చేరుకున్నాయి. అందరి సహకారంతో సచివాలయస్థాయి పోటీలు విజయవంతమయ్యాయి. ఐదు క్రీడాంశాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పోటీపడుతున్నారు. మండల స్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. అందులో విజేతలుగా నిలిచిన జట్లు నియోజకవర్గ స్థాయిలో తలపడాల్సి ఉంటుంది.

– పి. నరసింహారెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, అనంతపురం

షెడ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత

- 1,475 షెడ్లలో సగం ఈ వర్గాల లబ్ధిదారులకే కేటాయింపు



అనంతపురం అగ్రికల్చర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉచితంగా నిర్మించనున్న పాడి పశువుల షెడ్లలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత కల్పించాలని ఆదేశాలు వచ్చాయి. జిల్లాకు కేటాయించిన షెడ్లలో 50 శాతం అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకే మంజూరు చేయాలని స్పష్టం చేశారు. కరువు జాబితాలో ఉన్న మండలాలకు 50 చొప్పున, ఇతర మండలాలకు 25 చొప్పున ఉచిత షెడ్లు మంజూరు చేశారు. అనంతపురం జిల్లాకు మొత్తంగా 1,475 షెడ్లు కేటాయించారు. రెండు పశువుల షెడ్లకు రూ.లక్ష, నాలుగు పశువుల షెడ్‌కు రూ.1.50 లక్షలు, ఆరు పశువుల షెడ్‌కు రూ.1.80 లక్షలు వర్తింపజేశారు. రెండు పశువుల షెడ్ నిర్మాణంలో లేబర్ కాంపొనెంట్ కింద రూ.6,502, మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.70,871, విద్యుత్, ఇతరత్రా వాటికి రూ.22,627 వెచ్చించాలని ఖరారు చేశారు. అలాగే నాలుగు పశువుల షెడ్ విషయంలో లేబర్ కాంపొనెంట్ కింద రూ.10,658, మెటీరియల్ కాంపొనెట్ కింద రూ.1,16,607, విద్యుత్, ఇతరత్రా వాటికి రూ.22,735 ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఇక ఆరు పశువుల షెడ్‌కు సంబంధించి లేబర్ కాంపొనెంట్ కింద రూ.14,114, మెటీరియల్, విద్యుత్, ఇతరత్రా అన్ని కాంపొనెంట్ కింద రూ.1,65,886 ఖర్చు చేయాల్సి ఉంటుందని నిబంధనలు పెట్టినట్లు పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆసక్తి కలిగిన పాడి రైతులు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఆర్‌బీకేలు, పశువైద్యశాలలు, డ్వామా, ఉపాధి హామీ పథకం, ఎంపీడీఓ కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అందుబాటులోకి 'జెడ్పీ ప్రత్యేక వెబ్‌సైట్'



అనంతపురం సిటీ: జెడ్పీలో పారదర్శకత కోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించినట్లు ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్, డిప్యూటీ సీఈఓ లలితాబాయి తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకునే క్రమంలో https://zpananthapuramu.ap.gov.in వెబ్‌సైట్ రూపొందించినట్లు వివరించారు. పది అంశాలను ప్రధానంగా తీసుకొని వెబ్‌సైట్ రూపొందించామన్నారు. జెడ్పీ గురించి, జెడ్పీ కో-ఆప్షన్, జెడ్పీటీసీ సభ్యుల సమాచారం, స్థాయీ సంఘాల వివరాలు, ఇప్పటి వరకు జరిగిన సర్వసభ్య సమావేశాల మినిట్స్, ప్రతి ఏడాది రూపొందించే బడ్జెట్ అంచనాలు, జెడ్పీ నుంచి విడుదలయ్యే నిధులు, చేపట్టిన పనులు, చెల్లింపులు, సిబ్బంది వివరాలు, వారి విధులు, సమాచార హక్కు చట్టం, ముఖ్యమైన అధికారుల వివరాలతో పాటు ఫోన్ నంబర్లు, పనుల పర్యవేక్షణ వంటి కీలక అంశాలన్నీ వెబ్‌సైట్‌లో పరిశీలించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. వర్క్ మానిటరింగ్ సిస్టం (డబ్ల్యూఎంఎస్)కు సంబంధించి జెడ్పీటీసీ సభ్యులు, ప్లానింగ్/అకౌంట్స్ సెక్షన్లు, పీఆర్/ఆర్‌డబ్ల్యూఎస్, అనంతపురం/శ్రీసత్యసాయి జిల్లాల వారికి, డిప్యూటీ సీఈఓ, సీఈఓ, జెడ్పీ చైర్‌పర్సన్‌కు వేర్వేరు లాగిన్లు ఇచ్చినట్లు సీఈఓ తెలిపారు. పనులకు సంబంధించిన ప్రతిపాదనలను నేరుగా జెడ్పీ చైర్‌పర్సన్, సీఈఓ లాగిన్‌కు వచ్చేలా వెబ్‌సైట్ రూపొందించామన్నారు. తరువాత వాటికి అంచనాలు రూపొందించి తదుపరి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. పనుల స్థితిగతులను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చన్నారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి జెడ్పీటీసీ సభ్యులు జెడ్పీ కార్యాలయానికి రాకుండానే ఆన్‌లైన్ పద్ధతిలో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎన్నికల విధులకు సిద్ధంకండి



సెక్టోరియల్ అధికారుల సమావేశంలో పాల్గొన్న జేసీ కేతన్‌గార్గ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి వెంకటనారాయణమ్మ

ఉరవకొండ: 'త్వరలోనే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఎన్నికల విధులకు జిల్లా అధికారులందరూ సంసిద్ధం కావాలి'. అని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఉరవకొండ 149 అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో సెక్టోరియల్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 27 మంది సెక్టోరియల్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఇందులో ఒక్కో సెక్టోరియల్ అధికారికి 8 నుంచి 10 రూట్లు కేటాయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అధికారులు ప్రతి పోలింగ్ స్టేషన్ వెరిఫికేషన్ చేసి అందులో మౌళిక వసతులు ఉన్నాయా ? లేదా? అన్న రిపోర్టు ఇవ్వాలన్నారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి గతంలో జరిగిన ఘటనల గురించి నివేదిక ఇవ్వాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి వెంకటనారాయణమ్మ మాట్లాడుతూ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయా పీఎస్‌ల పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

కంబదూరు: 'ఉద్యాన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలిచ్చి పోత్సహిస్తోంది. ఉద్యాన రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి' అని జిల్లా ఉద్యానశాఖాధికారి రఘునాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఉద్యాన సహాయ సంచాలకులు బీఎంవీ నరసింహరావుతో కలిసి కంబదూరు మండలంలో పర్యటించి సాగైన వివిధ ఉద్యాన పంటలను పరిశీలించారు. ప్రభుత్వం ఉద్యాన రైతులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో అనేక రాయితీలను ఇస్తోందన్నారు. అనంతరం ఉద్యాన రబీ ఈ-క్రాప్ బుకింగ్ పురోగతిపై ఆర్‌బీకే సిబ్బందితో సమీక్షించారు. ఈ-క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖాధికారి గౌసియా, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక వృద్ధురాలి ఆత్మహత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

యాడికి: కడుపు నొప్పి తాళలేక ఓ వృద్ధురాలు చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన మండలంలోని రాయలచెరువు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు... పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడుకు చెందిన కుల్‌సింబీ (65)కు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. వారందరికీ వివాహం కూడా చేసింది. తన కుమారులతో కలసి కుల్‌సింబీ జీవిస్తూ గ్రామ సమీపంలోని తమలపాకుల తోటకు దినసరి కూలీకి పోతూ జీవనం సాగించేది. అయితే రెండు రోజుల క్రితం కుల్‌సింబీకి కడుపు నొప్పి రావటంతో కుమారులు రాయలచెరువులో ఓ ప్రైవేట్ క్లినిక్‌లో చూపించారు. కడుపు నొప్పి తగ్గక పోవటంతో మంగళవారం ఉదయం ఎమ్మిగనూరుకు వెళ్తానని చెప్పి కుల్‌సింబీ ఇంటి నుంచి వెళ్లింది. అయితే రాయలచెరువు గ్రామ సమీపంలో గుత్తికి పోయే రహదారిలో కొండగుట్ట వద్ద వేపచెట్టు కొమ్మకు తన చీరతో ఉరేవేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కుల్‌సింబీ మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌పై దాడి

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం వైఎస్సార్‌సీపీ సర్పంచు అజ్జుగుట్టు రామాంజులరెడ్డిపై అదే గ్రామానికి చెందిన రవిచంద్రారెడ్డి మంగళవారం ట్రాక్టరుతో దాడికి పాల్పడ్డాడు. ఇందులో భాగంగానే బాధితుడు రామాంజులరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. రామాంజులరెడ్డికి రవిచంద్రారెడ్డికి భూమి విషయం మనస్పర్థలు, పాతకక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ తోటవద్ద ఉన్న రామాంజులరెడ్డిని రవిచంద్రారెడ్డి ట్రాక్టరుతో ఢీకొట్టాడు. రామాంజులరెడ్డి వెంటనే 100 నెంబరుకు కాల్ చేసి సమస్యను తెలియజేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ధరణీబాబు సిబ్బందిని పంపించి విచారించారు. పాత కక్షల కారణంగా హత్యాయత్నానికి పాల్పడినట్లు వార్డుమెంబరు భార్య నిర్మల తెలిపారు. రామాంజులరెడ్డికి నడుముల వద్ద ట్రాక్టరు తగలడంతో బలమైన దెబ్బ తిన్నట్లు వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వరంగ షెడ్యూల్డ్ బ్యాంక్) (కెనరా బ్యాంకు వారి సౌజన్యంతో)
హెడ్ ఆఫీస్ : కడప, అనంతపురము రీజియన్
బ్రాంచ్ : అనంతపురము - P.T.C.

ప్రాంతీయ కార్యాలయం: అనంతపురము : బ్రాంచ్ : అనంతపురము- P.T.C

Ref: 1900/RRMD/RO-ATP/1071/2023-2024 తేది : 09-01-2024

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

(అనుబంధం-IV చట్టం - రూల్ 8(1) క్రింద)*

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొని **ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి** అయిన క్రింది సంతకందారు **30-10-2023 తేది** గల డిమాండ్ నోటీసులు జారీచేసి సదరు నోటీస్ తేదీ నుండి 60 రోజులలోగా నోటీస్‌లో తెలిపిన మొత్తం **రూ.49,73,432/- (నలభై తొమ్మిది లక్షల డెబ్బై మూడు వేల నాలుగు వందల ముప్పై రెండు రూపాయలు మాత్రమే)** లను తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత మరియు ఆస్తి యజమాని / హామీదారుని కోరారు.

క్ర. సం.	సదుపాయం స్వభావం	లోన్ అకౌంట్ నంబర్	పరిమితి	30-10-2023 నాటికి మిగులు బకాయి మొత్తం
1.	హౌసింగ్ లోన్	91111440371	రూ. 49,83,000/-	రూ. 49,73,432/-

ఆస్తి యజమాని **శ్రీమతి అకుల భారతి భర్త శ్రీ అకుల ముని శంకరయ్య మరియు శ్రీ అకుల ముని శంకరయ్య తండ్రి శ్రీ అకుల కొండయ్య** సదరు మొత్తమును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకొని దిగువ ఇందులో తెలిపిన ఆస్తిని దిగువ సంతకందారు **09 జనవరి 2024**న స్వాధీనం చేసుకున్నారని ఆస్తి యజమానికి మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీస్ ఇవ్వడమైనది.

సెక్యూర్డ్ అస్తులు విడిపించుకునే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 లోని సబ్ సెక్షన్ (8) లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతను కోరడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలైనా మొత్తం **రూ. 49,73,432/-** (30-10-2023 తేదీ నాటికి) మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొ॥వాటి కోసం **ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, అనంతపూర్, P.T.C బ్రాంచ్, అనంతపురం** వారి ఛార్జికి లోబడి జరుపవలెనని ముఖ్యంగా ఆస్తి యజమాని మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

ఆస్తి వివరణ:

దిగువ తెలిపిన వివరణతో నారాయణపురం పంచాయతి ఏరియాలో పాపంపేట గ్రామ భూమి పరిధిలో R.D మరియు S.R.D. అనంతపురం పరిధిలో గల డోర్ నం.4-900తో గల ఇంటి ఆస్తి. సర్వే నం. A.C A.C A.C A.C ప్లాట్ నం. పాత డోర్‌నం. కొత్త డోర్ నం. 48 18.83పైకి 8.76లపైకి 0.15 1/4లపైకి 0.10 1/4, 78.12 8-26, 26-124 ఇందులో ప్లాట్ నం.7 A.C. 0.05.125 H.S 0.021 లో గల ఇల్లు మరియు ఖాళీ స్థలం

ఆస్తి సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.8లో ఇల్లు, **పశ్చిమం** : అదే సర్వే నంబర్‌లోని ప్లాట్ నం.6లోని ఇల్లు, **ఉత్తరం** : కళ్యాణదుర్గం రోడ్, **దక్షిణం** : అదే డోర్ నంబర్‌లోని ప్లాట్ నం.12లో అకుల శివశంకరయ్య మిగిలిన ఇల్లు, **కొలతలు:** తూర్పు - పశ్చిమం వైపు: 37 అ.లు లేదా 11.22 మీ.లు, ఉత్తరం - దక్షిణం వైపు: 60 అ.లు లేదా 18.30 మీ.లు

RCC ఇంటి కొలతలు: తూర్పు-పశ్చిమం వైపు: 25 అ.లు, ఉత్తరం-దక్షిణ వైపు : 35 అ.లు

మొత్తం విస్తీర్ణం: 248.05 చ.గ.లు

తేది : 09-01-2024
ప్రదేశం : అనంతపురము

సం/- అధీకృత అధికారి,
(ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్)

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

శ్రీనివాస అకాడమి

■ Coaching for Phy/Chem. NEET/JEE Inter - I, II Yr Tutions for MPC/BiPC. Free - Tutions for SSC only -1- Month. Cont: 9618562274. [A-7418]

SERVICES

దుర్గాదేవి జ్యోతిష్య పీఠం

■ దుర్గాదేవి జ్యోతిష్య పీఠం: ఎస్.వి. రాఘవేంద్ర జోషి పునర్వివాహం, దాంపత్య సమస్యలు, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, స్త్రీ ప్రేమ, వశీకరణం, ప్రతి సమస్యకు అంజనం, హోమాలతో 2 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపగలరు. ✆ 6364 999 444 [B-1255221]

CHANGE OF NAME

■ I, GONI VIJAYAMMA (Old Name), W/o. Late Goni Basava Raju, Residing at D.No. 14-1-36, Gandhi Bazar, Uravakonda Town, Ananthapuramu District. A.P. Changing my name from Goni Vijayamma (Old Name) to G. VIJYA GOURI (New Name). Henceforth I am being called as G. VIJYA GOURI for all purposes. [A-6226]

WANTED

■ Wanted Pastors / Evangelists to work in a Christian Organisation Salary 25,000. ✆ 8618178750 / 8639212257. [G-664]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221898]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167591]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

తెలుగు తల్లికి నీరాజనం



తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న విజయబాబు, మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: అనంత సాహిత్యానికి, భాషకు అనంత కవులు, రచయితలు చేస్తున్న సేవ అభినందనీయమని అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు పేర్కొన్నారు. మేయర్ వసీం, టూరిజం శాఖాధికారి నాగేశ్వరరెడ్డి, డీఈవో నాగరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ సైపుల్లాబేగ్ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం ఇతోధికంగా తోడ్పడుతోందన్నారు. అంతకు ముందు నగరంలోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు.

ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డికి సన్మానం



దామోదరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: తెలుగు భాష సేవ ప్రతిభా పురస్కారం అందుకున్న శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. దామోదరరెడ్డిని మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు హబీబుద్దీన్, నజీర్, వలి, నరసింహులు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

15 వేల మందికి భిక్ష

అనంతపురం కల్చరల్: స్థానిక అశోక్‌నగర్‌లో ఉన్న హరిహర దేవాలయంలో సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1 నుంచి మాలధారులకు భిక్ష నిరంతరాయంగా కొనసాగింది. చిన్మయ మిషన్ ఆత్మ విదానంద సరస్వతి చేతుల మీదుగా భిక్ష కార్యక్రమం ప్రారంభమైంది. దాదాపు 15 వేల మంది మాలధారులు భిక్షకు హాజరయ్యారన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో వ్యక్తిగత క్రమ శిక్షణ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో సాయిట్రస్టు విజయ సాయి హరిహర దేవాలయం ప్రధాన కార్యదర్శి బొగ్గవరపు రవి, సాయి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని నందితను సన్మానిస్తున్న అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్ఎస్ఎస్ రాష్ట్ర స్థాయి ఉత్తమ వలంటీరు అవార్డు అందుకున్న ఆర్ట్స్ కళాశాల బీఎస్సీ మైక్రో బయాలజీ విద్యార్థిని జి. నందితను మంగళవారం సన్మానించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆశావాది శశాంక మౌళి మాట్లాడుతూ విద్యార్థిని నందిత ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన 'యువ సంగం', 'మేరీ మాటీ మేరా దేశ్' కార్యక్రమాల్లో పాల్గొని కేంద్ర యువజన క్రీడల శాఖ మంత్రి చేత ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు విష్ణుప్రియ, సోమశేఖర్, రామకృష్ణ, అధ్యాపకులు షమా భారతి, పల్లవి, మాధవి, రఘురాములు, శ్రీదేవి, ప్రసాద్, అమృతలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆడుదాం..ఆంధ్రా'



రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రాప్తాడు: మండల స్థాయిలో ఈ నెల 10 నుంచి నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ సాల్మన్ పేర్కొన్నారు. మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు రాప్తాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే క్రీడా రంగానికి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఐదు క్రీడాంశాలలో (క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీ బాల్) పోటీలను నిర్వహించామని, గ్రామీణ స్థాయిలో విజేతలకు మండల స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చాం

- ఆలమూరులో త్వరలో గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ



లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పింఛన్ పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

ఆత్మకూరు: ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చి ప్రజల వద్దకు వెళ్తున్నాం.. అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాం.. అభివృద్ధికి మారుపేరు 'తోపుదుర్తి' అని చెప్పుకునేలా చేశామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని తోపుదుర్తి గ్రామంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. అనంతరం ప్రజా సంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. మొదటగా జీఎల్ఎస్ఆర్ (గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్) రూ.19.5 లక్షలతో 2.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన రూ.40 లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాము ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు.

అభివృద్ధి చేసి ప్రజల్లోకెళ్తున్నాం..

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నాలుగున్నరేళ్ల కాలంలో నెరవేర్చాం.. కరోనా విపత్కర సమయంలోనూ ప్రాణాలను సైతం లెక్కజేయకుండా ప్రజలకు దగ్గరకు వెళ్తూ అన్ని సౌకర్యాలు కల్పించాం.. మాయ మాటలు చెప్పే సునీతకు అభివృద్ధి గురించి ఏం తెలుసు అని ఎమ్మెల్యే విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చే పథకాలనే పేరు మార్చి ఇస్తాం అంటున్నారు తప్ప.. వాళ్లేం చేస్తారో ప్రజలకు చెప్పలేకపోతున్నారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 17 వేల ఇళ్లు ఇచ్చామని, ప్రతిచెరువునూ నీటితో నింపామన్నారు. పేరూరు డ్యాంకు నీరు తెచ్చి, రైతుల కళ నెరవేర్చామని, 30 ఏళ్లు అధికారంలో ఉన్నా పేరూరు డ్యాంకు నీరు తీసుకురాలేదన్నారు. ఆలమూరు వద్ద ప్రభుత్వం 11 ఎకరాల్లో గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. ప్రస్తుతం అమ్మ డెయిరీ ద్వారా ఉపాధి పొందుతున్నారన్నారు. నియోజకవర్గంలో నీటి సమస్యను పరిష్కరించామన్నారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల ప్రజలకు ఇంటింటికీ కొళాయి కార్యక్రమంలో భాగంగా కృష్ణ, తుంగభద్ర జలాలు అందిస్తామన్నారు. పెన్నోహోబిలం రిజర్వాయర్ నుంచి ఆత్మకూరుకు నెలాఖరులోపు పైపు లైన్ పనులు పూర్తి చేయిస్తామన్నారు. పరిటాల సునీత, శ్రీరామ్ సొంత గ్రామాలకూ నీరు వెళ్లేలా పథకం తెచ్చామన్నారు.

ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచాం..

రామగిరి మండలంలోని బంగారు గనులు తెరపించామన్నారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో 20 వేల మంది ఇళ్లకు పింఛన్ వస్తే.. తమ ప్రభుత్వంలో 49 వేల మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు. తోపుదుర్తి పంచాయతీకి రూ.27 కోట్లతో సంక్షేమ పథకాలతో అభివృద్ధి చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచామన్నారు. బి.యాలేరు నుంచి రంగంపేట వరకు రోడ్డు పూర్తి చేశామన్నారు. తోపుదుర్తి రిజర్వాయర్ పనులూ చేపడతామన్నారు. తోపుదుర్తి రామాలయానికి రూ.10 లక్షలు, కొండ మీద ఉన్న వెంకటరమణస్వామి ఆలయ అభివృద్ధికి రూ.60 లక్షల చెక్కులను ఎండోమెంట్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాతపోన్న, రాష్ట్ర దూదేకుల డైరెక్టర్ అల్లీపీరా, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ విజయ్, సర్పంచులు ఓబులేసు, ఎర్రిస్వామి, ఎంపీటీసీ పోతులయ్య, మండల ఎలక్షన్ ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ షర్మిల, ఏఓ సుచరిత,ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు,రమణారెడ్డి, మల్లన్న, ఈశ్వరరెడ్డి,అంజినప్ప,శివయ్య,జయన్న,పిల్లల సోమశేఖర్,మల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



గ్రామ సభలో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: గ్రామాల్లో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని తూంచర్లలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల మంజూరు, భూ సమస్యలపైఅర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారంపై మండల స్థాయి అధికారులతో మాట్లాడి, వాటిని అక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, ఎంఈఓ అరుణమ్మ, హౌసింగ్ ఏఈ చిరంజీవి, స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సన్నద్ధతపై సమీక్షలో కలెక్టర్, ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధత, ఓటరు జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ అంశాలపై కేంద్ర ఎన్నికల కమిషన్ విజయవాడలోని నోవాటెల్‌లో కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ నేతృత్వంలో ఎన్నికల కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తో పాటు సీనియర్ డిప్యూటీ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు హాజరై వివిధ అంశాలపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ అన్బురాజన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆడుదాం ఆంధ్రా మారథాన్



మరథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ఆడుదాం - ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి మంగళవారం జరిగిన మారథాన్ అందరినీ ఆకట్టుకుంది. జూనియర్ కళాశాలలో మేయర్ వసీం మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. మారథాన్ జూనియర్ కళాశాల నుంచి ఆర్ట్స్ కళాశాల, టవర్‌క్లాక్ వరకు సాగింది. మేయర్ వసీం మాట్లాడుతూ దేశ చరిత్రలోనే అతిపెద్ద క్రీడా సంబరంగా ఆడుదాం - ఆంధ్రా కార్యక్రమం నిలుస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల్లోని నైపుణ్యతను వెలికి తీసి, వారు జాతీయ స్థాయికి ఎదిగేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, ఇషాక్, లాలూ, శేఖర్‌బాబు, పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలోనే కాన్పులు సురక్షితం



గర్భిణులకు భోజనం పెడుతున్న వైద్యాధికారిణి శ్రావణి

రాప్తాడు: ప్రభుత్వాస్పత్రిలోనే కాన్పులు సురక్షితమని వైద్యాధికారి శ్రావణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పుట్టబోవు బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు బలవర్ధకఆహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు ఐరన్ మాత్రలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. బుధ, శనివారం ఇమ్యునైజేషన్ చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణుల విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దాతల సహకారంతో గర్భిణులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తలుపూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



తలుపూరులో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని తలుపూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తలుపూరు, వడ్డుపల్లి గ్రామాల నుంచి వైద్య పరీక్షలకు తరలివచ్చారు. వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల దగ్గరకే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిధిని పెంచినట్లు తెలిపారు. అనంతరం బీపీ, షుగర్, రక్త పరీక్షలు, జ్వరం, కంటి పరీక్షలు నిర్వహించి, మందులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ భార్గవి, తలుపూరు సర్పంచ్ ఓబులేష్, ఎంపీటీసీ ఓబులేసు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, వడ్డుపల్లి మాజీ సర్పంచ్ ఓబిరెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు పాటుపడాలి



కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: కార్మికుల సమ్మెతో నగరంలో చెత్త గుట్టలుగా పేరుకుపోయిందని, నగర పరిశుభ్రతకు పాటుపడి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కార్మిక సంఘాల నాయకులు మేయర్ వసీం సూచించారు. బుధవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో కార్మిక సంఘాల నాయకులతో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు సమావేశం అయ్యారు. మేయర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు కోవిడ్ వర్కర్లను కొనసాగించిన విషయాన్ని గుర్తు చేశారు. మృతి చెందిన కార్మిక కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించినట్లు తెలిపారు. తమ పాలకవర్గం కార్మికుల పక్షాన ఉంటుందన్నారు. నగర పారిశుద్ధ్యం మెరుగునకు సహకరించాలన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలు మాట్లాడుతూ గత ప్రభుత్వంతో పోల్చితే తమ పాలకవర్గంలో కార్మికులభ్యున్నతికి పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. కమిషనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగుల విధులకు అడ్డు పడడం సరికాదన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, కమల్‌భూషణ్, బాబా, రహింతుల్లా, సంపంగి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్పానికి ఐదేళ్లు



ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా రాప్తాడులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నగరపాలక సంస్థ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయ సంకల్పానికి ఐదేళ్లు పూర్తయ్యిందని, పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్ ప్రజా పరిపాలన అందించి లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపారని మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా నగర పాలక సంస్థలో మేయర్ వసీం ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మేయర్ కేక్ కట్ చేసి ప్రజాప్రతినిధులు, నాయకులకు పంచిపెట్టారు. మేయర్ వసీం మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్రను ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేసి, చరిత్ర సృష్టించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్య పడుతుందన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా సీఎం ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, సంపంగి రామాంజినేయులు, శేఖర్‌బాబు, బాబా, రహంతుల్లా, ఇసాక్, అబూసలేహా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్: ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ అనంతపురం రూరల్ మండల నాయకులు పార్టీ కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చంద్రకుమార్, నాయకులు ధనుంజయయాదవ్, గోవిందరెడ్డి, గుజ్జల ఈశ్వరయ్య, కామారుపల్లి లోకనాథ్, కురుకుంట ఆదినారాయణ, మునీర్, నిఖిల్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యాత్ర చరిత్రాత్మకం

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర చరిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది తెలిపారు. మంగళవారం ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కేక్ కోసి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నల రవికుమార్, చిరుతల నాగేంద్ర, పెద్ద లింగమయ్య, కుల్లాయప్ప, వెంకటనారాయణ, ముత్యాలప్ప, కొండా రెడ్డి, నారాయణ రెడ్డి, వివేకానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరిగిందని ఆపార్టీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రామగిరిలో మండల నాయకులతో కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, దాసరి మోహన్ బాబు, రామకృష్ణారెడ్డి, బాబయ్య, చిరంజీవి, రాజు, సూరి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుంది

చెన్నేకొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చరిత్రలో నిలిచిపోతుందని జెడ్పీటీసీ గోవింద రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌టీడీ శ్రీనివాస రెడ్డి, సన్నాయప్ప సిద్దప్ప, లక్ష్మీరెడ్డి, ఓబిరెడ్డి, కృష్ణమూర్తి, కేశవయ్య, నారాయణ స్వామి, జయరామిరెడ్డి, బుక్కారెడ్డి, బత్రి లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి ఆనంద్ రాజ్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌అండ్‌టీ, బ్లూ స్టార్, కియా, శ్రీజ కంపెనీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారు అనంతపురం, బెంగళూరు, హైదరాబాదు, హిందూపురంలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉదయం 9 గంటలకు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు సెల్: 8317520929లో సంప్రదించాలని తెలిపారు.

ప్రశాంతంగా జీవించాలి

ఆత్మకూరు: గ్రామాల్లో గొడవలకు పోకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ జనార్దన్ ప్రజలకు సూచిచారు. మంగళవారం గొరిదిండ్ల గ్రామంలో సిబ్బందితో కలిసి పర్యటించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా పర్యటిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సారా తయారు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'ప్రభుత్వాన్ని విమర్శించలేదు'

అనంతపురం టవర్‌క్లాక్: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణను అడ్డుకోవడం సరికాదని, అయితే తాను ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను విమర్శించలేదని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ విగ్రహం ఏర్పాటుకు సిద్ధం చేసుకోగా, ప్రారంభోత్సవం కానివ్వకుండా అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఓబుళంపల్లిలో బుధవారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్న వైద్య శిబిరానికి వచ్చే వారు తమ ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ తీసుకు రావాలన్నారు.

రేపిస్టులకు జైలు గోడలే సరైన శిక్ష

అనంతపురం టవర్‌క్లాక్: బిల్కిస్ బానో రేపిస్టులకు జైలు శిక్షే సరైన నిర్ణయమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాకే హరి మాట్లాడారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం సిటీ: అనంతపురం లెక్చరర్స్ కాలనీ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని ఓ వ్యక్తి (55) మృతదేహాన్ని మంగళవారం సాయంత్రం కనుగొన్నట్లు జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. ముస్లిం కమ్యూనిటీకి చెందిన వ్యక్తిగా భావిస్తున్న మృతుడు ఎవరైందీ అంతుబట్టడం లేదన్నారు. రైలు కింద పడి మరణించినట్లు భావిస్తున్నారు. మృతదేహం ముక్కలై చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు అందరినీ భయభ్రాంతులకు గురి చేశాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.